శుక్రవారం । 21 । జూన్ । 2024



యోగా మార్గం
దీర్ఘకాలిక వ్యాధులు, మానసిక ఒత్తిళ్ల నుంచి యోగా ఉపశమనం కలిగిస్తోంది.

వివరాలు 8లో ▸



ఆర్టీసీ సేవలు మరింత చేరువ
ఆర్టీసీ సేవలు ప్రజలకు మరింత చేరువ చేయాలని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
34.8 /23.7

వాతావరణం
రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం, రాత్రివేళలో మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బియ్యం శాంపిల్స్ సేకరణ




కల్వకుర్తిరూరల్: పట్టణంలోని ఎస్‌ఆర్‌బీ రైస్ మిల్లు నుంచి తరలించేందుకు డీసీఎంలో నింపిన బియ్యాన్ని గురువారం జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి స్వామికుమార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ రవి పరిశీలించారు. రైస్‌మిల్లు నుంచి రేషన్ బియ్యం తరలిస్తున్నారన్న సమాచారం మేరకు బుధవారం ఎస్‌ఐ మాధవరెడ్డి మిల్లు వద్దకు చేరుకొని పరిశీలించారు. విషయాన్ని అధికారులకు తెలియజేశారు. ఈమేరకు సంబంధిత అధికారులు మిల్లు వద్దకు చేరుకొని బియ్యం విషయంపై ఆరా తీశారు. అనంతరం మిల్లులో తనిఖీలు నిర్వహించారు. డీసీఎంలో నింపిన 290 బస్తాల బియ్యాన్ని స్థానిక సద్గురు రాఘవేంద్ర మిల్లుకు తరలించారు. బియ్యం శాంపిల్స్ ల్యాబ్‌కు పంపిస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా విలేకరులు అడిగిన ప్రశ్నలకు సివిల్ సప్లయ్ అధికారులు సరైన సమాధానం చెప్పక పోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మిల్లు యజమానులు మాత్రం అవి రేషన్ బియ్యం కాదని.. మరాడించిన బియ్యం అని చెప్పారు. ల్యాబ్ నివేదిక అందిన తర్వాతే అసలు విషయం తెలుస్తుందని, అంతవరకు బియ్యాన్ని సద్గురు రాఘవేంద్ర రైస్‌మిల్లులో నిల్వ ఉంచుతున్నట్లు డీఎస్‌ఓ స్వామికుమార్ తెలిపారు.

స్వయం ఉపాధి కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోర్సుల్లో వచ్చే నెల 1 నుంచి 14వ బ్యాచ్ శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు డీవైఎస్‌ఓ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాస్ లేదా ఫెయిలైన వారు మూడు నెలలపాటు ఫ్యాషన్ డిజైనింగ్, గార్మెంట్ తయారీ, బ్యూటీషియన్, ఎంఎస్ ఆఫీస్, రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండిషన్ రిపేర్, మొబైల్ సర్వీసింగ్ రిపేరుపై శిక్షణ ఇస్తారన్నారు. 7వ తరగతి పాసైన వారికి జర్దోసి, మగ్గం, ఎలక్ట్రీషియన్‌పై శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం పరీక్ష నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి హైదరాబాద్ సెట్విన్ వారిచే సర్టిఫికెట్ ఇస్తారని, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గలవారు పాత డీఈఓ కార్యాలయంలోని వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు వెంట విద్యార్హత, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటో, కులం సర్టిఫికెట్లు జతచేయాలని కోరారు.

25 నుంచి ఓపెన్ డిగ్రీ ప్రాక్టికల్ పరీక్షలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ మొదటి సంవత్సరం ప్రాక్టికల్ పరీక్షలు ఈనెల 25 నుంచి నిర్వహిస్తున్నట్లు కోఆర్డినేటర్ సత్యనారాయణగౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఐడీ కార్డు, ఫీజు చెల్లించిన రిసిప్ట్‌తో పరీక్షలకు హాజరు కావాలని సూచించారు. టైం టేబుల్ కోసం సంబంధిత స్టడీ సెంటర్, పూర్తి వివరాల కోసం సెల్ నం.73829 29609ను సంప్రదించాలని కోరారు.



అబలపై పైశాచికత్వం

పొలం పనికి రావడం లేదనే నెపంతో చెంచు మహిళపై అమానుష దాడి

- రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంఘటన
- నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్
- కొల్లాపూర్‌లో ఖాకీల తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు



సాక్షి, నాగర్‌కర్నూల్/కొల్లాపూర్ రూరల్: తమ వారే అని నమ్మి రావడమే ఆమె పాలిట శాపమైంది. ఆమె అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకున్న ఇద్దరు వ్యక్తులు పాశవికంగా, వికృతంగా దాడి చేసిన సంఘటన కలకలం సృష్టించింది. నాగర్‌కర్నూల్ జిల్లాలోని కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లికి చెందిన చెంచు మహిళ ఈశ్వరమ్మపై అదే గ్రామానికి చెందిన బండి వెంకటేశ్, శివ అమానుష దాడికి పాల్పడిన ఘటనపై ఆదివాసీ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. బాధితురాలి సొంత పొలాన్ని కౌలుకు తీసుకుని, ఆమెను కూలీగా మార్చి.. భూయజమానిపైనే పైశాచిక దాడికి పాల్పడటం విస్మయం కలిగిస్తోంది. దాడి చేసిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. కాగా..ఈ కేసుకు సంబంధించి నలుగురు నిందితులను గురువారం సాయంత్రం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

పోలీసుల తీరుపై విమర్శలు..

చెంచు మహిళపై అమానుష దాడి పట్ల పోలీసుల ప్రవర్తన తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఘటనపై ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేయకపోవడంపై రాజకీయ ఒత్తిళ్లే కారణమన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఘటన జరిగిన కొల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధి పోలీసుల తీరు తరుచుగా వివాదాస్పదం అవుతోంది. ఈ స్టేషన్‌కు వస్తున్న ఫిర్యాదులు, కేసుల విషయంలో రాజకీయ నేతలు, ప్రజాప్రతినిధుల ఒత్తిడితో వారికి అనుకూలంగానే వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల నియోజకవర్గ ముఖ్యనేత ఒత్తిళ్ల మేరకు సింగోటం గ్రామానికి చెందిన వ్యక్తులను సివిల్ తగాదా.. భూ పంచాయతీలో నాలుగు రోజుల పాటు స్టేషన్‌కు పిలిపించుకుని లాఠీలతో విచక్షణ రహితంగా బాదినట్లు తెలిసింది. గతంలోనూ పొలిటికల్ ఒత్తిళ్ల మేరకు ఓ జర్నలిస్టును పోలీస్‌స్టేషన్‌లోనే దుస్తులు విప్పించి లాఠీలతో బాదారన్న ఆరోపణలు ఉన్నాయి. రాజకీయ ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధుల జోక్యంతో ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నలుగురి అరెస్టు..



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్

చెంచు మహిళపై అకారణంగా దాడి చేసి ఘటనకు సంబంధించి నలుగురిని అదుపులోకి తీసుకున్నామని, నిందితులను రిమాండ్‌కు తరలిస్తామని నాగర్‌కర్నూల్ డీఎస్పీ శ్రీనివాస్ అన్నారు. గురువారం ఆయన కొల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. చెంచు మహిళ ఈశ్వరమ్మపై గ్రామానికి చెందిన బండి వెంకటేశ్వర్లు, ఆయన భార్య శివమ్మ, వారి బంధువులు లింగస్వామి, లక్ష్మి అమానుషంగా దాడి చేసి.. చిత్రహింసలకు గురిచేసి.. ప్రత్యేక భాగాలపై డీజిల్ పోసి కాల్చినట్లు విచారణలో తెలిసిందన్నారు. ఈ మేరకు బాధితురాలిని చికిత్స నిమిత్తం నాగర్‌కర్నూల్ జనరల్ ఆస్పత్రికి తరలించామని చెప్పారు.



బాధితురాలితో వివరాలు తెలుసుకుంటున్న సఖి కేంద్రం సిబ్బంది

దోషులను శిక్షించాలి..



మొలచింతపల్లిలో చెంచు మహిళ ఈశ్వరమ్మపై అమానుషంగా దాడి చేసి గాయపరిచిన బండి వెంకటేశ్వర్లు, అతని తమ్ముడు శివను వెంటనే అరెస్టు చేసి ఎస్సీ, ఎస్టీ చట్టం ప్రకారం శిక్షించాలి. లేకపోతే చెంచు మహిళా సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతాం.

– చెన్నమ్మ, మహిళా సంఘం సభ్యురాలు

హేయమైన చర్య..



చెంచు మహిళ ఈశ్వరమ్మపై గ్రామానికి చెందిన బండి వెంకటేశ్వర్లు, అతని తమ్ముడు శివ, వెంకటేశ్వర్లు భార్య శివమ్మ విచక్షణ రహితంగా దాడి చేసి.. వికృత చర్యలకు పాల్పడటం హేయమైన చర్య. ప్రభుత్వం వారిని వెంటనే అరెస్టు చేసి శిక్షించాలి. అలాగే భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి.

– లక్ష్మి, మొలచింతపల్లి చెంచుగూడెం

న్యాయం చేయాలి..



ఆదివాసీల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని వారి సొంత వ్యవసాయ పొలంలో వారినే కూలీలుగా మార్చుకొని వారి మీదనే దాష్టీకం చేయడం దురదృష్టకరం. పోలీసులు నిందితులను కఠినంగా శిక్షించడంతోపాటు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి. బాధిత చెంచులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయాలి.

– నిమ్మల శ్రీనివాసులు, ఆదివాసి ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు

రాజకీయ ఒత్తిళ్లతోనే..



చెంచు మహిళపై దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలి. రాజకీయ ఒత్తిళ్లతో అన్యాయం చేయాలని చూస్తే ఊరుకోం. ఈ ఘటనపై ఆదివాసీలు సంఘటితమై పోరాడి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలి.

– మల్లికార్జున్, మాజీ సర్పంచ్, సార్లపల్లి, అమ్రాబాద్

హీనంగా చూస్తున్నారు..



మమ్మల్ని జంతువుల కంటే హీనంగా చూస్తున్నారు. మా చెంచు మహిళను దారుణంగా కొట్టడాన్ని జీర్ణించుకోలేకపోతున్నాం. దాడికి పాల్పడిన దుండగులను పోలీసులు వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్ష పడేలా చూడాలి. ప్రజాప్రతినిధులు చెంచు కుటుంబానికి అండగా నిలవాలి.

– దాసరి నాగయ్య, చెంచు సేవా సంఘం రాష్ట్ర నాయకులు

అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని..



చెంచు పెంటలలో జరుగుతున్న అరాచకాలు వెలుగులోకి వచ్చేవి కొన్నే. చెంచుల అమాయత్వాన్ని ఆసరాగా చేసుకుని కొందరు వికృత చర్యలకు పాల్పడుతున్నారు. ఆర్థికంగా, సామాజికంగా నష్టం చేకూరుస్తున్నారు. మొలచింతపల్లి ఘటనలో నిందితులను చట్టపరంగా శిక్షించాలి. బాధితురాలికి ప్రభుత్వం ఆర్థిక సహాయం, మెరుగైన వైద్య సేవలను అందించాలి.

– కాట్రాజు శ్రీనివాసులు, చెంచులోకం రాష్ట్ర అధ్యక్షుడు

ఉపాధి కల్పనలో కొత్త ఒరవడి



మన్ననూర్‌లోని రెసిడెన్షియల్ ఐటీఐ కళాశాల

ఏటీసీలుగా ఐటీఐ కళాశాలలు అప్‌గ్రేడ్

- ఒక్కో కాలేజీకి రూ. 34కోట్ల వ్యయం
- ఏటీసీల్లో ఆరు కొత్త కోర్సుల నిర్వహణ
- ఈ ఏడాది నుంచే ప్రారంభానికి కసరత్తు

నాగర్‌కర్నూల్/మన్ననూర్: ప్రస్తుతం ఐటీఐలో ఉన్న కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు పెద్దగా ఉపాధి అవకాశాలు లభించడం లేదు. విద్యార్థులు పోటీ ప్రపంచంలో రాణించి.. త్వరగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ఐటీఐ కళాశాలల ఆధునికీకరణకు శ్రీకారం చుట్టింది. ఇప్పటి వరకు ఇండస్ట్రియల్ ట్రెనింగ్ సెంటర్‌లుగా ఉన్న కళాశాలలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)లుగా మార్చబోతోంది. టాటా టెక్నాలజీస్ లిమిటెడ్‌తో కలిసి ఏటీసీ సెంటర్లను ఏర్పాటుచేసి, విద్యార్థులకు పలు కొత్త కోర్సుల్లో శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. దీంతో జిల్లాలో రెండు ఏటీసీ సెంటర్లు ఏర్పాటు కానున్నాయి. ఒక్కో ఏటీసీలో ఆరు కొత్త కోర్సులు ఏర్పాటు చేయనున్నారు. ఈ కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించే బాధ్యత ఏటీసీలే తీసుకోనున్నాయి. అయితే ఒక్కో కోర్సులో ఎంత మంది విద్యార్థులు శిక్షణ పొందుతారనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది.

కొత్త భవనాలకు మార్కింగ్ పూర్తి..

జిల్లాలోని కల్వకుర్తి, మన్ననూర్‌లో ఇప్పటికే ఐటీఐ కళాశాలలు కొనసాగుతున్నాయి. వీటిని కొనసాగిస్తూనే, వీటి ఆవరణలో ఏటీసీ సెంటర్లను ఏర్పాటు చేయనున్నారు. అందుకోసం ఇప్పటికే ఆయా కళాశాలల ఆవరణలో కొత్త భవనాల నిర్మాణానికి మార్కింగ్ పూర్తిచేశారు. ఈ భవనాలు నిర్మించే బాధ్యతను ఆర్‌వీ అసోసియేట్స్, సుధాకర్ ఇన్‌ఫ్రాకు అప్పగించారు. అయితే ఒక్కో ఏటీసీ సెంటర్‌కు ప్రభుత్వం దాదాపు రూ. 34 కోట్ల వరకు ఖర్చు చేస్తోంది. ఈ నిధులతో ఇన్‌స్ట్రక్టర్ల నియామకంతో పాటు శిక్షణకు అవసరమైన వర్క్‌షాప్‌లు, సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ, ఇతర సామగ్రి, పలు సదపాయాలను కల్పించనున్నారు. ఈ సంవత్సరం నుంచే కొత్త కోర్సులను ప్రారంభించాలని నిర్ణయించగా.. రెండు నెలల్లో అన్ని సదుపాయాలు కల్పించడం ప్రశ్నార్థకంగా మారింది. ఆయా కోర్సుల్లో కేటాయించిన సీట్ల మేరకు విద్యార్థులకు అవకాశం కల్పించడంతో పాటు ఐటీఐ కళాశాలల్లో సీట్ల కేటాయింపుల మాదిరిగానే ఏటీసీల్లోనూ నిబంధనలు పాటించనున్నారు.

■ మూడున్నర దశాబ్దాల క్రితం దివంగత మాజీ మంత్రి పుట్టపాగ మహేంద్రనాథ్ చొరవతో మన్ననూర్‌లో ఆర్‌ఐటీఐ కళాశాలను ఏర్పాటుచేశారు. షెడ్యూల్డ్ తెగలు, కులాలు, వెనకబడిన తరగతుల వారు అధికంగా ఉన్న ఏజెన్సీ ప్రాంతంలో విద్యార్థుల కోసం నెలకొల్పిన రెసిడెన్షియల్ ఐటీఐ కళాశాల అప్పట్లో రికార్డు స్థాయిలో నిర్వహణ కొనసాగింది. కాలక్రమేణ అక్కడక్కడ ఐటీఐ సంస్థలు ఏర్పడటం.. నాగరిక వృత్తివిద్య విధానాలు అమలుకు నోచుకోక పోవడంతో ఈ సంస్థ కొంత వెనకబాటుకు గురైంది. మారుతున్న కాలానుగుణంగా ప్రభుత్వం ఆర్‌ఐటీఐ కళాశాలను ఏటీసీ సెంటర్‌గా అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం మన్ననూర్ ఆర్‌ఐటీఐ సంస్థ భవనాల మరమ్మతు కోసం ఈసీఐఎల్, సీఎస్‌ఆర్ ద్వారా సుమారు రూ. 72 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో ఇప్పటికే కొన్ని పనులు పూర్తి కాగా.. మరికొన్ని పనులు కొనసాగుతున్నాయి.

విద్యార్థులకు సువర్ణావకాశం..



ఐటీఐ కళాశాలలను ఏటీసీలుగా మార్చడం విద్యార్థులకు ఒక సువర్ణావకాశం లాంటిది. ఏటీసీలలో ప్రవేశపెట్టిన కొత్త కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఆధునిక ప్రపంచంలో తక్షణ ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. కొత్త కోర్సులు నిర్వహించేందుకు అవసరమైన భవన నిర్మాణానికి ఇప్పటికే మార్కింగ్ పూర్తిచేశాం. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– కె.జయమ్మ, ప్రిన్సిపాల్, ఆర్ఐటీఐ కళాశాల, మన్ననూర్

కొత్త కోర్సులు ఇలా..

ఏటీసీలలో ప్రవేశపెట్టే ఆరు కొత్త కోర్సుల్లో మూడు కోర్సులు సంవత్సర కాలవ్యవధి ఉంటే.. మరో మూడు కోర్సులకు రెండు సంవత్సరాల కాలవ్యవధిని నిర్ణయించారు. అందులో మ్యానుఫాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్ అండ్ డిజిటల్ మ్యానుఫాక్చరింగ్, ఆర్టిజన్ యూసింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్ కోర్సులు ఒక సంవత్సరం పాటు ఉంటాయి. బేసిక్ డిజైనర్ అండ్ విర్చువల్ వెరిఫైయర్, అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మిషన్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్ కోర్సులను రెండేళ్ల పాటు నిర్వహించనున్నారు. ఒక్కో కోర్సులో సుమారు 20 మంది విద్యార్థులు ఉండే అవకాశం ఉండగా.. దీనిపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ ప్రత్యేక కోర్సులకు సంబంధించి శిక్షణ ఇచ్చే ఇన్‌స్ట్రక్టర్లు, కావాల్సిన సిబ్బందిని కూడా టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ వారు నియమించనున్నారు.



గడువులోగా సీఎంఆర్ అందించకుంటే చర్యలు

నాగర్‌కర్నూల్/నాగర్‌కర్నూల్ క్రైం/బిజినేపల్లి: వానాకాలం, యాసంగి (2022 – 23) సీజన్లకు సంబంధించిన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)ను నిర్ణీత గడువులోగా అందించకుంటే చర్యలు తప్పవని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సీతారామారావుతో కలిసి సివిల్ సప్లయ్ అధికారులు, రైస్ మిల్లర్లతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈనెల 26వ తేదీలోగా రైస్ మిల్లర్లు బియ్యం ఆడించి, ఎఫ్‌సీఐకి పంపాలని ఆదేశించారు. ధాన్యం నిల్వలను పక్కదారి పట్టిస్తే, కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. 2022–23 వానాకాలానికి సంబంధించి 93,268 మెట్రిక్ టన్నుల సీఎంఆర్‌కు గాను ఇప్పటి వరకు 75,853 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ప్రభుత్వానికి అప్పగించినట్లు తెలిపారు. ఇంకా 17,415 మెట్రిక్ టన్నుల బియ్యం అందించాల్సి ఉందన్నారు. అదే విధంగా 2023–24 వానాకాలానికి సంబంధించి 49,048 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ అందించాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 7,192 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ అప్పగించినట్లు తెలిపారు. ఇంకా 41,856 మెట్రిక్ టన్నుల బియ్యం అందించాల్సి ఉందని.. నిర్ణీత గడువులోగా బియ్యాన్ని అందించకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి స్వామి కుమార్, మేనేజర్ బాలరాజు ఉన్నారు.



వట్టెంలో మిషన్ భగీరథ ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

పిల్లల్లో నులి పురుగులను నిర్మూలిద్దాం

పిల్లల్లో నులి పురుగులను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నులి పురుగులతో పిల్లల్లో రక్తహీనత ఏర్పడి ఎదుగుదల అంతంతమాత్రంగా ఉంటుందన్నారు. 19 ఏళ్లలోపు వారందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డా. సుధాకర్‌లాల్, డీఈఓ గోవిందరాజులు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వెంకటదాసు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి రవినాయక్, హెచ్‌ఎం లత తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీటిని వృథా చేయొద్దు

మిషన్ భగీరథ పథకం ద్వారా అందించే తాగునీటిని వృథా చేయరాదని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బిజినేపల్లి మండలంలోని వట్టెం, రాంరెడ్డిపల్లి తండాలలో మిషన్ భగీరథ ఇంటింటి సర్వేను పరిశీలించారు. ఈసందర్భంగా తాగునీటి సరఫరాపై ప్రజలతో ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని గ్రామాల్లో శనివారంలోగా ఇంటింటి సర్వేను పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. వర్షాకాలంలో పారిశుద్ధ్యం లోపించకుండా డ్రెయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని తెలిపారు. అనంతరం వట్టెం గ్రామపంచాయతీలో పలు రికార్డులను పరిశీలించారు. బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. పాఠశాలల్లో పెండింగ్ పనుల పూర్తికి అవసరమైన బడ్జెట్‌ను విడుదల చేస్తామన్నారు. డీఈఓ, డీపీఓ కృష్ణ, ఇన్‌చార్జి సీఈఓ గోపాల్‌నాయక్, తహసీల్దార్ శ్రీరాములు, ఎంపీడీఓ కతలప్ప ఉన్నారు.

క్లుప్తంగా

ఆస్పత్రిలో మహిళ మృతి

- వైద్యుల నిర్లక్ష్యమంటూ కుటుంబ సభ్యులు, బంధువుల ఆందోళన

మహబూబ్‌నగర్ క్రైం: వైద్యుల నిర్లక్ష్యంతోనే మహిళ మృతి చెందిందంటూ కుటుంబ సభ్యులు, బంధువులు జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టిన ఘటన గురువారం చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. నారాయణపేట జిల్లా మద్దూర్‌కు చెందిన జయశ్రీ గర్భసంచి శస్త్రచికిత్స కోసం ఈ నెల 18న మహబూబ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరింది. గురువారం ఉదయం ఆపరేషన్ చేయగా రక్తపోటు అధికమై కార్డియాటిక్ అరెస్ట్‌తో మృతి చెందినట్లు తెలుస్తోంది. వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతి చెందిందని ఆరోపిస్తూ బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో ఆస్పత్రి వర్గాలు, జయశ్రీ బంధువుల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగినట్లు తెలుస్తోంది. తమవైపు నుంచి ఎలాంటి పొరపాటు లేదని వైద్యులు మీడియా సమావేశం ఏర్పాటు చేసి వెల్లడించారు. అయితే అదే ఆస్పత్రిలో మూడురోజుల వ్యవధిలో రెండు మరణాలు చోటు చేసుకోవడం ఆందోళనకు గురి చేస్తోంది.

చికిత్స పొందుతూ వ్యక్తి..


బాలకృష్ణ (ఫైల్)

కొత్తకోట రూరల్: బైక్‌పై వెళ్తున్న వ్యక్తి అదుపుతప్పి డీవైడర్‌ను ఢీకొని తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. ఈనెల 1న కొత్తకోటకు చెందిన తోక బాలకృష్ణ(32) బైక్‌పై ఇంటికి వెళ్తున్న క్రమంలో అదుపుతప్పి డీవైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108లో వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కర్నూల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. 20 రోజులుగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. అతనికి భార్య మమత, కుమారుడు, కూతురు ఉన్నారు. మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు.

సుంకేసుల డ్యాంలో మృతదేహం

రాజోళి: మండలంలోని తుంగభద్ర నదిపై ఉన్న సుంకేసుల డ్యాంలో మృతదేహం ఉన్నట్లుగా బుధవారం స్థానికులు తెలిపారు. డ్యాంలో మృతదేహం ఉందని మధ్యాహ్నం నుంచి పలువురికి అనుమానం వచ్చినప్పటికీ దానిపై ఎవరూ స్పందించలేదు. మత్స్యకారులు దాన్ని పరిశీలించాక మృతదేహం ఆనవాళ్లు స్పష్టంగా కనిపిస్తున్నాయని రాత్రి పోలీలసుకు సమాచారం ఇచ్చారు. స్టోరేజీ నీటిలో ఉండడంతో రాత్రి సమయంలో అక్కడకు వెళ్లి బయటకు తీయడానికి, పరిశీలించడానికి కుదరలేదని స్థానికులు పేర్కొన్నారు. ఈ విషయంపై ఎస్ఐ జగదీష్‌ను వివరణ కోరగా, నదిలో మృతదేహం ఉన్నట్లుగా తమకు సమాచారం వచ్చిందని, శుక్రవారం ఉదయం నది వద్దకు వెళ్లి బయటకు తీసి, దర్యాప్తు చేస్తామని ఆయన తెలిపారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

- ఏడుగురిపై కేసులు నమోదు

లింగాల: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఎక్సైజ్ శాఖ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. రాయవరం, దారారం, పద్మన్నపల్లి, చెన్నంపల్లి అప్పాయపల్లి గ్రామాలలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగార్జున ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు సోదాలు చేపట్టాయి. 40 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకోవడంతో పాటు 1,700 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. నాటుసారా విక్రయాలు సాగిస్తున్న ఏడుగురిని అదుపులోకి తీసుకొని, కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.



దీర్ఘకాలిక వ్యాధులు, మానసిక ఒత్తిళ్ల నుంచి ఉపశమనం కలిగించేందుకు సంపూర్ణ ఆరోగ్యానికి యోగా ఒక్కటే సరైన మార్గం. ఇదే విషయాన్ని ప్రధాని నరేంద్రమోదీ.. 'హర్‌రోజ్ ఏక్ గంట సాధన్‌కరో' .. ఆరోగ్యపతి బనావో' అంటూ పిలుపునిచ్చారు. భారతీయ యోగాకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేకమైన గుర్తింపు, గౌరవం ఉంది. శుక్రవారం ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలో యోగాలో ప్రతిభ చూపడంతో పాటు శిక్షణ ఇస్తున్న వారిపై ప్రత్యేక కథనం..



ఆరోగ్య పథం.. యోగా మార్గం

- రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణ
- గురుకులాలు, పాఠశాలల్లోనూ ప్రత్యేక తరగతులు
- మానసిక ఒత్తిళ్ల నుంచి ఉపశమనం.. దీర్ఘకాలిక వ్యాధులు నయం

నేడు ప్రపంచ యోగా దినోత్సవం

వనజారెడ్డి ప్రతిభ

మహబూబ్‌నగర్ క్రీడలు: ప్రస్తుతం యాంత్రిక జీవనంలో ఎన్నో ఒత్తిళ్లు, దీర్ఘకాలిక సమస్యలతో బాధపడేవారికి యోగా ఒక వరంలా ఉపయోగపడుతుంది. భారతీయ యోగాకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. పీఎం నరేంద్రమోదీ కృషితో ప్రపంచంలో యోగాకు ప్రముఖస్థానం దక్కింది. ప్రపంచంలోని వందలాది దేశాల్లో యోగాసాధన చేస్తున్నారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా ప్రత్యేక కథనాలు...
జిల్లా కేంద్రంలోని షీటీం మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్న వనజారెడ్డి యోగాలో మెరుగైన ప్రతిభ కనబరుస్తోంది. ఉద్యోగం నిర్వహిస్తూనే యోగా, మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో రాణిస్తుంది. యోగా రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది.

సాధించిన పతకాలు..
ఈమె పలుసార్లు జాతీయ, రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో పాల్గొని పతకాలు సాధించింది. 2012లో గచ్చిబౌలీలో రాష్ట్రస్థాయి పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో అథ్లెటిక్స్‌లో రజతం, 2014లో వైజాగ్‌లో జరిగిన పోలీస్ మీట్‌లో 10 కిలోమీటర్ల నడకలో బంగారు పతకం పొందింది. అదే ఏడాది ఆదిలాబాద్ (బాసర)లో రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో రజతం, 2016లో కర్నాటక (ఉడిపి)లో జాతీయ స్థాయి యోగాలో బంగారు పతకం సాధించింది. వైజాగ్‌లో జరిగిన పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో యోగాలో రజతం పొందింది. 2017 జార్ఖండ్ రాష్ట్రం రాంచీలో జరిగిన ఆలిండియా పోలీస్ స్పోర్ట్స్ మీట్ యోగా విభాగంలో బంగారు పతకం సాధించింది. 2018 పంజాబ్ రాష్ట్రం పటియాలో జాతీయ స్థాయి యోగా పోటీల్లో రజత పతకం అందుకున్నారు. 2018లో పోలీస్‌సేవా పతకాన్ని అందుకున్నారు. అదేవిధంగా 2019లో పలుసార్లు యోగా పోటీల్లో పాల్గొంది. 2023 ఏపీ రాష్ట్రంలో తాడేపల్లిగూడెంలో జరిగిన యోగా పోటీల్లో వనజారెడ్డి రాణించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో గోవాలో జరిగిన ఆరో నేషనల్ మాస్టర్స్ గేమ్స్‌లో పాల్గొని బంగారు పతకం సాధించింది. గత నెలలో హైదరాబాద్‌లోని గచ్చిబౌలీ స్టేడియంలో పాన్ ఇండియా మాస్టర్స్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఫెడరేషన్ కప్ నేషనల్ మాస్టర్స్ క్రీడల్లో వనజారెడ్డి ప్రతిభచాటి 45 ఏళ్ల పైబడిన విభాగంలో లాంగ్‌జంప్, హైజంప్, 800మీటర్ల పరుగులో మూడు పతకాలు సాధించారు.


యోగాసనాలు చేస్తున్న వనజారెడ్డి

అంతర్జాతీయస్థాయిలో ఆడాలన్నదే లక్ష్యం..

యోగాలో అంతర్జాతీయస్థాయిలో దేశానికి ప్రాతినిధ్యం వహించడమే లక్ష్యం.. యోగా విద్యను ప్రతి ఒక్కరికి అందించాలి. ముఖ్యంగా మహిళలు, బాలికలు శిక్షణ తీసుకోవాలి. నిరంతరం యోగా చేస్తే ఎలాంటి రోగాలు దరిచేరవు. యోగాలో రాణిస్తున్నందుకు డిపార్ట్‌మెంట్‌లో ప్రత్యేక గుర్తింపు ఉంది. – వనజారెడ్డి

కరాటే, యోగా గురువు వెంకటేష్


యోగా విన్యాసాలు ప్రదర్శిస్తున్న కోటకదిర వెంకటేష్

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి చెందిన కోటకదిర వెంకటేష్ కరాటేతోపాటు యోగా మాస్టార్‌గా పేరొందారు. విద్యార్థులకు కరాటేతో పాటు ప్రత్యేకంగా యోగాలో శిక్షణ ఇస్తుంటారు. ప్రతి ఏడాది జిల్లా కేంద్రంలో కరాటే, యోగా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. ప్రతి ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవాల్లో విన్యాసాలను ప్రదర్శిస్తున్నారు. 23 ఏళ్ల నుంచి నిత్యం మహబూబ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ మోడల్ బేసిక్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కరాటే, యోగాలో శిక్షణ అందిస్తున్నారు. గత ఏడాది జిల్లా కేంద్రం మీదుగా సాగిన భారత్ జోడోయాత్రలో రాహుల్‌గాంధీ ఎదుట యోగా విన్యాసాలు ప్రదర్శించారు.

పల్లె 'యోగ' సాధకుడు

- కేరళ, రాజస్థాన్ సెంట్రల్ యూనివర్సిటీలో యోగాపై పీజీ
- పొట్టి శ్రీరాములు యూనివర్సిటీలో యోగా కోఆర్డినేటర్‌గా విధులు


యోగా విన్యాసం చేస్తున్న రామాంజనేయులు

నర్వ: నారాయణపేట జిల్లా నర్వ మండలం కొత్తపల్లికి చెందిన రామంజనేయులుది నిరుపేద రైతు కుటుంబం. చిన్నప్పటి నుంచి ఆటలు, యోగాపై మక్కువతో యోగా నేర్చుకునేందుకు ఎక్కువ సమయం కేటాయించే వాడు. కేరళ సెంట్రల్ యూనివర్సిటీలో పీజీ డిప్లొమా చేశాడు. సీయూసీఈటీ ఎంట్రెన్స్ ద్వారా యోగ థెరపీలో పీజీని రాజస్థాన్ సెంట్రల్ యూనివర్సిటీలో పూర్తి చేశాడు. ఇషా ఫౌండేషన్‌లో నెల పాటు యోగా శిక్షణ తీసుకున్నాడు. ప్రస్తుతం గ్రామాల్లో, ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో ఉచిత యోగ తరగతులను నిర్వహిస్తు ప్రచారం చేస్తున్నారు. అదేవిధంగా పొట్టి శ్రీరాములు తెలుగు యూనవర్సిటీలో యోగా కోర్సు గెస్ట్ కోఆర్డినేటర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా విలేజ్ యోగా స్టూడియో పేరుతో యూట్యూబ్ ఛానల్ తయారు చేసి యోగాతో తన అనుభవాలను, నిరంతరం పోస్ట్ చేసి ప్రచారం పొందాడు.

ప్రజల్లో చైతన్యం తీసుకొస్తా

చిన్నప్పటి నుంచి యోగాపై మక్కువతో ప్రత్యేక పీజీ చేశాను. గ్రామీణ, పట్టణ స్థాయి వరకు ప్రజల్లో యోగాపై చైతన్యం చేసేందుకు అనేక శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాను. ప్రోత్సాహం అందిస్తే విద్యార్థులకు, యువకులుకు, పెద్దలకు మెళకువలు నేర్పిస్తా.
– రామంజనేయులు

తండ్రి బాటలో కూతురు, కుమారుడు

నవాబుపేట: యోగాలో పురుషోత్తం ప్రత్యేక రికార్డు సాధించారు. ఏకంగా మూడు పర్యాయాలు జాతీయ పోటీలకు ఎంపికై, 8 సార్లు రాష్ట్ర స్థాయి మొదటి బహుమతులు సాధించారు. నవాబుపేట మండలంలోని మరికల్‌కు చెందిన పురుషోత్తం తనతో పాటు భార్య నిర్మల, కూతురు ఝాన్సిరాణి, కుమారుడు చరణ్‌లకు సైతం యోగాలో శిక్షణ ఇచ్చాడు. భార్య మరికల్‌లో మహిళలకు యోగా నేర్పుతుండగా, పురుషోత్తం యువకులకు యోగా శిక్షణ కార్యక్రమాలు చేస్తుంటాడు.

సాధించిన పథకాలు
2014లో యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పోటీలలో రాష్ట్ర స్థాయి మొదటి బహుమతి, 2015లో నిజామాబాద్‌లో రాష్ట్ర స్థాయి ద్వితీయ బహుమతి పొందాడు. 2016లో మరోసారి రాష్ట్ర స్థాయి బంగారు పతకం పొందాడు. 2016లో కర్ణాటక మంగళూరులో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని 5వ స్థానంలో నిలిచాడు. 2016లో జరిగిన దక్షిణ భారత జాతీయ స్థాయి పోటీలలో మొదటి బహుమతి సాధించాడు. 2017-18 జాతీయ స్థాయి పోటీల్లో నాల్గవ స్థానంలో నిలిచాడు.


యోగాలో పురుషోత్తం విన్యాసం

ప్రజలను తప్పుదోవ పట్టించిన బీఆర్ఎస్


గద్వాల జిల్లా కేంద్రంలో విజయోత్సవ ర్యాలీలో ఎంపీ మల్లురవి, నాయకులు

- నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి

గద్వాల అర్బన్: గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలను తప్పుదోవ పట్టించిందని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎంపీ మల్లురవి అన్నారు. ఎంపీగా గెలుపొందిన ఆయన గద్వాలకు మొదటిసారి రావడంతో గురువారం అనంతపురం స్టేజీ వద్ద నుంచి జిల్లా కేంద్రంలోని పాతబస్టాండు వరకు విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీచైర్‌పర్సన్ సరిత ఎంపీ మల్లురవికి గజమాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని పాతబస్టాండులో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. పదేళ్లుగా పరిపాలించిన బీఆర్ఎస్ నాయకులు మతిభ్రమించి ప్రజలను తప్పుదోవ పట్టించేలా కాంగ్రెస్ ప్రభుత్వం దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గద్వాల నియోజకవర్గ ఆభివృద్ధికి తమవంతు కృషి చేస్తానని, ఈ నియోజకవర్గానికి దత్తత తీసుకొని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా జెడ్పీ మాజీ చైర్మన్ బండారీ భాస్కర్, నాయకులు గట్టు తిమ్మప్ప, బండ్ల చంద్రశేఖర్ రెడ్డి, పద్మ వెంకటేశ్వర్ రెడ్డి, శంకర్, నల్లారెడ్డి, ఇసాక్, లత్తిపురం వెంకట్రామిరెడ్డి తదితరులు ఉన్నారు.

ఏటీఎంలో నగదు చోరీకి యత్నం



గద్వాల క్రైం: గుర్తుతెలియని వ్యక్తులు ఏటీఎంను ధ్వంసం చేసి నగదు కాజేసేందుకు యత్నించిన ఘటన గురువారం తెల్లవారుజామున చోటు చేసుకున్నట్లు పట్టణ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. జిల్లాకేంద్రంలోని పాత కూరగాయాల మార్కెట్ సమీపంలో పంజాబ్ నేషనల్ బ్యాంకు, ఏటీఎం ఏర్పాటు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు ఏటీఎంను బండారాయితో ధ్వంసం చేశారు. లాకర్ తెరుచుకోకపోవడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఉదయం బ్యాంకుకు వచ్చిన మేనేజర్ మనోజ్‌కుమార్ ఏటీఎం ధ్వంసమైనట్లు గుర్తించి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

గుర్తుతెలియని వృద్ధుడు మృతి

అచ్చంపేట రూరల్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో గురువారం గుర్తుతెలియని వృద్ధుడు (60) మృతిచెందాడు. ఎస్ఐ రాములు వివరాల మేరకు.. గీతల చొక్క, కాషాయం లుంగి ధరించిన వృద్ధుడు పట్టణంలో భిక్షాటన చేస్తూ జీవించేవాడు. తీవ్రమైన అనారోగ్యం, ఆకలితో మృతిచెంది ఉంటాడని ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని అచ్చంపేట మార్చురీకి తరలించినట్లు పేర్కొన్నారు.

కల్వకుర్తిలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఏర్పాటు


చెర్కూర్ శివారులో ప్రభుత్వ భూములను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, అధికారులు

వెల్దండ: కల్వకుర్తి నియోజకవర్గంలో త్వరలోనే స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని పెద్దాపూర్, చెర్కూర్ శివారుల్లో గురువారం రెవెన్యూ అధికారులతో కలిసి ప్రభుత్వ భూములను పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతలో నైపుణ్యం పెంపొందించి, ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఏర్పాటుతో కల్వకుర్తి ప్రాంతంలోని నిరుద్యోగులకు మంచి అవకాశాలు లభిస్తాయన్నారు. యూనివర్సిటీ ఏర్పాటు కోసం చెర్కూర్ శివారులోని సర్వే నంబర్ 473లో దాదాపు 150 ఎకరాలు, పెద్దాపూర్‌లోని సర్వే నంబర్ 34లో 28 ఎకరాల భూమిని పరిశీలించినట్లు చెప్పారు. యూనివర్సిటీకి 100 నుంచి 150 ఎకరాల స్థలం అవసరమవుతుందని అన్నారు. ఎమ్మెల్యే వెంట ఆర్డీఓ శ్రీనునాయక్, తహసీల్దార్ రవికుమార్, ఎస్ఐ రవి, సర్వేయర్ అనసూయ, రాజశేఖర్ ఉన్నారు.

మ్యాన్‌హోల్‌లో పడి పారిశుద్ధ్య కార్మికుడి మృతి


కాలె చంద్రయ్య (ఫైల్)

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ప్రమాదవశాత్తు మ్యాన్‌హోల్‌లో పడి ఓ కాంట్రాక్ట్ పారిశుద్ధ్య కార్మికుడు మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎనుగొండకు చెందిన కాలె చంద్రయ్య (55) కొన్నాళ్లుగా స్థానిక మున్సిపాలిటీలో కాంట్రాక్ట్ పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్నారు. ఎప్పటిలాగే గురువారం నాలుగో వార్డు పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీ-మసీదు లైన్‌లో ఉన్న అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ (యూజీడీ)లో మురుగు తొలగించేందుకు ఒక్కడే వెళ్లాడు. ఇది ఆరు నుంచి ఎనిమిది ఫీట్ల లోతు, మూడు ఫీట్ల వెడల్పు ఉంటుంది. సాధారణంగా అందులోని మురుగును తొలగించాలంటే కనీసం ఇద్దరు లేదా ముగ్గురు అవసరం. అయితే ఎవరికీ చెప్పకుండా అతను ఒక్కడే మ్యాన్‌హోల్ కప్పు పక్కన పెట్టి, అందులోకి దిగి పనిచేశాడు. అనంతరం ఓ ఇనుప చువ్వ సాయంతో పైకి వస్తుండగా ప్రమాదవశాత్తు పడి చనిపోయాడు. కాగా, అతడి బైక్ మధ్యాహ్నం వరకు మ్యాన్‌హోల్ సమీపంలోనే ఉండటంతో, తోటి పారిశుద్ధ్య కార్మికులకు అనుమానం వచ్చి, వెళ్లి చూడగా అతడి మృతదేహం కనిపించింది. మృతదేహాన్ని జిల్లా మార్చురీకి తరలించగా.. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఇదిలా ఉండగా, బాధిత కుటుంబాన్ని మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్‌అహ్మద్ తదితరులు పరామర్శించారు. తక్షణ సాయంగా రూ.30 వేలు అందజేశారు. మృతుడికి భార్య బాలమ్మతో పాటు కూతురు, కుమారుడు అన్నారు. మృతుడి కుటుంబానికి రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందజేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, మున్సిపల్ కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి ఎర్ర నర్సింహులు, సంఘం నాయకుడు బాలరాజు డిమాండ్‌చేశారు.

దొంగతనం కేసులో విచారణకు పిలిచిన పోలీసులు..

పురుగు మందు తాగి మహిళ మృతి


లక్ష్మి (ఫైల్)

కొల్లాపూర్ రూరల్/చిన్నంబావి: ఓ దొంగతనం కేసులో విచారణ కోసం పోలీసుస్టేషన్‌కు పిలవగా.. పురుగు మందు తాగి వచ్చిన ఆ మహిళ మృతి చెందింది. వివరాల్లోకి వెళితే.. వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం వెల్టూరు గ్రామానికి చెందిన వెంకటేష్, లక్ష్మి (35)కి 13ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఓ కుమార్తె కూడా ఉంది. లక్ష్మి నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లపూర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పని చేసింది. గతేడాది ఆస్పత్రిలో జరిగిన ఓ దొంగతనం కేసుకు సంబంధించి పోలీసులు విచారణ నిమిత్తం గురువారం స్టేషన్‌కు రావాల్సిందిగా ఎస్ఐ సూచించారు. దీంతో స్టేషన్‌కు వచ్చిన లక్ష్మి కాసేపటికి పోలీస్‌స్టేషన్ ఆవరణలో కిందపడిపోయి అపస్మారకస్థితిలోకి చేరుకుంది. ఆమెకు ఫిట్స్ వచ్చాయనుకొని వెంటనే పోలీసులు కొల్లాపూర్ సివిల్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ప్రథమ చికిత్స చేసి ఆమె పురుగు మందు తాగినట్లు గుర్తించారు. వెంటనే 108 అంబులెన్స్‌లో నాగర్‌కర్నూల్ జనరల్ ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గంమధ్యలో ఆమె చనిపోయింది. ఈ ఘటనకు సంబంధించి డీఎస్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ కేసు విచారణ నిమిత్తమే ఆమెను పిలిచామని, ఇందులో పోలీసుల పాత్ర ఏమి లేదని చెప్పారు.కాగా.. తాను విచారణ పిలవలేదని ఎస్ఐ హృషికేష్ చెప్పడం గమనార్హం. అయితే లక్ష్మి పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ముందు గురువారం ఉదయం డబ్బుల విషయంలో గొడవ పడి ఇంటినుంచి వచ్చినట్లు వెల్టూరు గ్రామస్తులు తెలిపారు.

814.7 అడుగుల నీటిమట్టం

దోమలపెంట/మదనాపురం: శ్రీశైలం జలాశయంలో గురువారం 814.7 అడుగుల వద్ద 37.1936 టీఎంసీల నీటినిల్వ ఉంది. సుంకేసుల నుంచి 449 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. 24 గంటల వ్యవధిలో రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకి 286 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోశారు. జలాశయంలో 75 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

- రామన్‌పాడు జలాశయంలో నీటిమట్టం నిలకడగా కొనసాగుతోంది. జూరాల సమాంతర కాల్వ ద్వారా 1,000 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. గురువారం నాటికి 1,019 అడుగులకు నీటిమట్టం చేరింది. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు ఏఈ రనీల్‌రెడ్డి తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

PLOT FOR SALE
- Plot for Sale 200yds at Padmavathi Colony, Mahabub nagar M : 9886154400 [HA-2009]

SERVICES

BUSINESS OFFER
- ICF కార్పొరేషన్ అగ్రికల్చర్, బిజినెస్ పర్సనల్, ఎడ్యుకేషన్, ప్రాపర్టీ పైన అమౌంట్ ఇవ్వబడును. ఏజెంట్స్ & DMA కావలెను. జీతం+కమీషన్. సంప్ర: 7888242891 [H-189668]
- లాభదాయకమైన వ్యాపారం కోసం లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబీ డైపర్ మెషిన్ స్థాపించండి. ప్లాస్టిక్ ఉద్యోగ్‌తో బై బ్యాక్ అగ్రిమెంట్. (Govt. అప్రూవ్డ్) 8376001873, 9643010487, 8376089771, 011-25920179 [DA-5707]

PASSPORT MISSING
- I have lost my passport RC, Having passport No.A4954061, In the name of ABDUL NASEER MOHAMMED S/o MOINUDDIN RC.No.TS06EU1263.TS31E4686 Two Wheels. [J-1153091]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధంలేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు - సాక్షి, మేనేజర్

ఆర్టీసీ సేవలు మరింత చేరువ చేయాలి

నారాయణపేట రూరల్ / దామరగిద్ద: రోడ్డు సౌకర్యం ఉన్న ప్రతీ గ్రామానికి ఆర్టీసీ బస్సు నడిపించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో నుంచి నూతనంగా పునఃప్రారంభిస్తున్న శ్రీశైలం (డీలక్స్), సజనాపూర్ (పల్లెవెలుగు) బస్సులను ఆర్టీసీ రీజనల్ మేనేజర్ శ్రీదేవితో కలిసి ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించదని, అన్ని రూట్లలో, ప్రతీ పల్లెకు ఆర్టీసీ ప్రగతి చక్రం వెళ్లే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా శ్రీశైలంతో పాటు ఇతర పుణ్యక్షేత్రాలకు సైతం బస్సులను ప్లాన్ చేయాలన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన సర్వీసులను విద్యార్థులు, యాత్రికులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్ఎం శ్రీదేవి అన్నారు. ఎమ్మెల్యే పర్ణికరెడ్డి కోరిక మేరకు సజనాపూర్‌కు ప్రతీ రోజు రెండు ట్రిప్పులు బస్సు నడిపిస్తామన్నారు. శ్రీశైలం బస్సు నారాయణపేటలో మధ్యాహ్నం 1.50గంటలకు బయలుదేరి రాత్రి 8.30గంటలకు చేరుతుందని, శ్రీశైలంలో ఉదయం 5గంటలకు బయలుదేరి నారాయణపేటకు ఉదయం 11.30గంటలకు వస్తుందన్నారు. కార్యక్రమంలో డీఎం లక్ష్మిసుధ, సీఐ అలివేలమ్మ, ఎంఎఫ్ చంద్రానాయక్, శ్రీశైలమ్మ, భీమమ్మ, ఏడీసీలు ఆంజనేయులు, అశోక్‌రెడ్డి, రవికుమార్ పాల్గొన్నారు.


ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, ఆర్ఎం శ్రీదేవి